## 108 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

కౌటాల, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం ఆలయ అధ్యక్షుడు వొజ్జల వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో 108 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మహేశ్ శర్మ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి చరిత్రను భక్తులకు వివరించారు. మండలంలోని ఆర్య వైశ్యులతో పాటు బెజ్జూర్, పెంచికల్ పేట, దహెగాం, సిర్పూర్(టి) మండలాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, అన్నదానం చేశారు.

## 104 అంబులెన్స్ డ్రైవర్లు అటాచ్

నమస్తే ఎఫెక్ట్

- జీజీహెచ్ సూపరింటెండెంట్, టీవీవీ, కేటాయింపు
- 'హైర్ వెహికిల్‌కు అంబులెన్స్ డ్రైవర్' కథనానికి స్పందన

మంచిర్యాల, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'హైర్ వెహికల్‌కు అంబులెన్స్ డ్రైవర్' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి వైద్యారోగ్యశాఖ స్పందించింది. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పనిచేసే ఓ ప్రాజెక్ట్ ఆఫీసర్ 104 డ్రైవర్‌ను తన కిరాయి వాహనం నడిపేందుకు వాడుకుంటున్నట్లు ఆధారాలతో సహా వార్త ప్రచురితమైంది. స్పందించిన వైద్యారోగ్యశాఖ 104 అంబులెన్స్ డ్రైవర్లను అటాచ్ చేయాలని నిర్ణయించింది. అంబులెన్స్ సేవలను నిలిపివేశాక ఐదుగురు డ్రైవర్లకు ప్రత్యామ్నాయ విధులు లేకపోవడంతో డీఎంహెచ్‌వో కార్యాలయానికే వస్తున్నారు. అవసరం ఉన్న ఒకరిద్దరిని ఉంచి మిగతావారిని ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్, టీవీవీ(తెలంగాణ వైద్య విధాన పరిషత్), ప్రభుత్వ వాహనాలున్న పీహెచ్‌సీలకు అటాచ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నామని, రెండుమూడ్రోజుల్లో ప్రక్రియ పూర్తిచేస్తామని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు తెలిపారు.



అమ్మవారి మొక్కును తీర్చుకుంటున్న భక్తులు



గద్దెపైకి సమ్మక్కను తీసుకొచ్చిన కోయ పూజారి కృష్ణ దొర



తండ్రి భుజంపై కూర్చొని అమ్మవార్లకు మొక్కుతున్న చిన్నారి





జాతరలో కోయ పూజారులు

# కొలువుదీరిన వన దేవతలు

## సమ్మక్క రాకతో గోదారి తీరానికి భక్తుల తాకిడి

- పుణ్యస్నానాలు, మొక్కుల చెల్లింపు
- గుడారాలతో నిండిన నదీపరిసరాలు
- సీసీ, డ్రోన్ కెమెరాలతో పోలీసుల పర్యవేక్షణ
- అమ్మవార్ల సేవలో వలంటీర్లు, కమిటీ సభ్యులు



గోదావరి తీరంలో భక్తులు ఏర్పాటు చేసుకున్న గుడారాలు



అమ్మవార్లకు ఎత్తు బంగారం (బెల్లం) జోకుతున్న భక్తులు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 22: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో వన దేవతల జాతర రెండో రోజూ వైభవంగా సాగింది. బుధవారం సారలమ్మను గద్దెపైకి చేర్చగా, గురువారం సాయంత్రం మాతా శిశు దవాఖాన వద్ద ఉన్న ఇల్లారి (గుడి) నుంచి కోయ పూజారులు సమ్మక్కను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. పోలీసుల బందోబస్తు నడుమ డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో, పటాకలను కాల్చుతూ మేడారం గిరిజన పూజారి కృష్ణ దొర సంప్రదాయ రీతిలో సమ్మక్కను తీసుకువచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో వెంట వచ్చారు. వేకువ జామునే గిరి పూజారులు అడవి నుంచి తీసుకవచ్చిన కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ప్రతిష్ఠించారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు,మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య దంపతులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మొదటి రోజు వచ్చి గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు. అమ్మవార్లను గద్దెల మీద ప్రతిష్ఠించిన తరువాత ఎత్తు బంగారం (బెల్లం), సీరె, సారె, శివసత్తుల పూనకాలతో, కోళ్లు, మేకలను బలిచ్చి వారి మొక్కులను తీర్చుకున్నారు. హుండీలో కానుకలు సమర్పించుకున్నారు. అక్కడే వంట చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

### తల్లుల సేవలో..

భక్తులకు సేవలందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు, పోలీస్ సిబ్బంది, సేవా కమిటీ సభ్యులు తరలివచ్చారు. భక్తులను క్యూలో పంపించి, తల్లుల దర్శనం కల్పించారు. దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు పలు సూచనలు చేస్తూ జాతర సజావుగా సాగేలా సహకరిస్తున్నారు. జాతర ప్రాంతాన్ని పోలీస్, ఎండోమెంట్, మున్సిపల్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ ఆరె వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు, జాతర ప్రాంతాన్ని డ్రోన్, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. పారిశుధ్య చర్యలతో పాటు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది తలెత్తకుండా ఆయా శాఖల సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

## విద్యాదానం అదృష్టంగా భావించాలి



పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ హేమంత్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అరిగెల నాగేశ్వర్‌రావు

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- కలెక్టర్ హేమంత్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి గ్రంథాలయం ప్రారంభం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22: విద్యాదానం చేయడం అదృష్టంగా భావించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో ఉన్న మండల పరిషత్ కాంప్లెక్స్‌లో గురువారం నక్క వెంటమ్మ, యాదగిరి స్వామి ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ సహదేవరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్, సంస్థ ప్రతినిధులు ఉమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం విషయంలో జిల్లా వెనుకబడి ఉన్నప్పటికీ, ఉద్యోగ ఫలితాల్లో టాప్‌లో నిలుస్తున్నదని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపయోగపడేలా పుస్తకాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని సంస్థ సభ్యులు, అరిగెల బ్రదర్స్‌ను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజధానిలో ఉంటూ మారుమూల జిల్లాను గుర్తుంచుకొని, తల్లిదండ్రుల పేరిట సంస్థను ఏర్పాటు చేసి, ఇలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, నాయకులు వెంకన్న, శ్రీనివాస్, గోపాల్ నాయక్, నిసార్, షబ్బీర్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్
- సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులతో సమీక్ష

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22: పది,ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ సూచించారు. కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం ఎస్పీ సురేశ్ కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్య, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఈవో అశోక్, డీఐఈవో శంకర్, డీఎస్పీ కరుణాకర్, డీఎంహెచ్‌వో తుకారాం భట్, డీపీవో ఉమర్‌హుస్సేన్, ఎస్బీ సీఐ రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు ధృడత్వాన్ని పెంపొందిస్తాయి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్



పోలీస్ సిబ్బందికి స్పోర్ట్స్ కిట్‌ను అందజేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 22: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న వారికి క్రీడలు శారీరకంగా, మానసికంగా ఎంతో దోహదపడుతాయని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బందికి క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ, విరామ సమయాల్లో క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో మన జిల్లా కు పథకాలు తీసుకురావడానికి, మెరుగైన ప్రతిభ చూపేందుకు స్పోర్ట్స్ కిట్స్ అందజేసి సిబ్బందిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్ తదితరులున్నారు.

### బదిలీపై వెళ్తున్న సీఐకి సన్మానం

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు సిద్దిపేట కమిషరేట్‌కు బదిలీ కావడంతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సురేశ్ కుమార్ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్,స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్, ఆసిఫాబాద్ సీఐ సతీశ్, డీపీవో ఏవో శ్రీనివాస్, ఫింగర్ ప్రింట్ విభాగం సీఐ మార్కండేయ , ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీవో అంజన్న, ఎస్ఐలు రామకృష్ణ, వెంకటేష్, మహేందర్, ఆర్ఎస్ఐలు ఓదెలు, కిరణ్ తదితరులున్నారు.

## కలెక్టర్‌ను కలుద్దామంటే నెట్టేసిన్రు..

### అందుకే మా అమ్మ సివిల్స్ సాధించమని ప్రోత్సహించింది

- రెండు సార్లు ప్రయత్నించినా సక్సెస్ రాలేదు..
- తల్లిదండ్రులు ఇల్లు అమ్మి చదివిస్తే డీఎస్పీ అయ్యా
- కష్టపడితే సాధ్యం కానిది లేదు..
- కానిస్టేబుళ్ల శిక్షణ కార్యక్రమంలో రామగుండం సీపీ శ్రీనివాసులు



శిక్షణ కానిస్టేబుల్‌కు మెటీరియల్‌ను అందజేస్తున్న సీపీ, కమాండెంట్

హాజీపూర్, ఫిబ్రవరి 22: చిన్నతనంలో మా అమ్మతో కలిసి కలెక్టర్‌ను కలుద్దామని వెళ్తే మమ్మల్ని నెట్టేశారని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాన్ని గుడిపేటలో ఉన్న 13వ ప్రత్యేక తెంగాణ పోలీస్ బెటాలియన్‌లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ ఘటనతోనే.. ఇల్లు అమ్మి మా అమ్మ కలెక్టర్‌ను చేస్తానంది. ఎనిమిదేండ్లు వేచి చూసినా కాలేకపోయాను. రెండు సార్లు ప్రయత్నించినా ప్రిలిమ్స్, మెయిన్స్‌లో క్వాలి ఫై అయి, ఇంటర్వ్యూలో వెనుదిరిగా. అమ్మా నాన్న ఇల్లు అమ్మి చదివిస్తే డీఎస్పీ అయ్యాను' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కష్టపడి చదివితే ఉద్యోగం తప్పకుండా వస్తుందన్నారు. సమాజ సేవ చేయడానికి మీకు పోలీస్ ఉద్యోగం వచ్చిందని, ఈ తొమ్మిది నెలల శిక్షణ సమయంలో ఎలాంటి రిమార్క్ లేకుండా క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. బెటాలియన్ కమాండెంట్ జమీల్ బాషా మాట్లాడుతూ శిక్షణలో భాగంగా 331 మంది ఏఆర్ కానిస్టేబుల్స్ రావాల్సి ఉండగా, 241 మంది వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు మిగతా వారు చేరేందుకు అవకాశం ఉందన్నారు. శిక్షణ కానిస్టేబుళ్లకు సీపీ చేతుల మీదుగా మెటీరియల్స్ అందజేశారు. సీపీని బెటాలియన్ కమాడెంట్ శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. మంచిర్యాల ఏసీపీని బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ సురేశ్ వర్మ, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.